ఆహారం...ఆరోగ్యం

- ప్రజల జీవన విధానంలో మార్పులు
- వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్ వినియోగం
- రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటితో చేసిన ఆహారానికి ప్రాధాన్యం



- 8లో

ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట



కషాయం తయారు చేసే పనిలో ఉన్న మహిళలు

వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి మండలానికో గ్రామంలో శత శాతం ప్రకృతి సేద్యం దిశగా అడుగులు

- గ్రామాల్లో సర్వే చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శత శాతం రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించి సాగు చేసేలా చైతన్యవంతం చేసే కార్యక్రమాలకు వ్యవసాయశాఖ శ్రీకారం చుట్టింది. చాలా ఏళ్లగా అన్ని ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో దాని ఫలితాలు పెద్దగా కనిపించడం లేదు. ఈ క్రమంలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో శత శాతం రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు ప్రస్తుతం గ్రామాల్లో సర్వే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని గుర్తించి, ఆ గ్రామంలోని రైతులందరూ సేంద్రీయ ఎరువులు వాడి ప్రకృతి వ్యవసాయం చేసేలా వారిని చైతన్యవంతులను చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమం అమలులో వ్యవసాయశాఖ, అనుబంధ విభాగం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు స్థానిక డ్వాక్రా మహిళలు, రైతుల భాగస్వామ్యంతో ఈ పథకం అమలయ్యేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రకృతి వ్యవసాయం అమలు చేసేందుకు ప్రస్తుతం మండలాలవారీగా గ్రామాల ఎంపిక పై అధికారులు సర్వే చేపట్టారు. గ్రామాలను గుర్తించిన అనంతరం అక్కడ స్థానిక రైతులతో పాటు స్థానిక డ్వాక్రా మహిళలకు కలిపి మండలాల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఇచ్చే అవకాశం ఉంది. దీనిలో భాగంగా తొలుత ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులందరి వివరాలు సేకరించి వారు ఏ పద్ధతిలో సాగు చేస్తున్నారో తెలుసుకుని, వారికి సేంద్రీయ సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ సాగులో నిరంతర ఆదాయం లభించేలా పంటలు పండించే పద్ధతులను రైతులకు అలవాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. వరి, ఇతర సాధారణ పంటలతో పాటు ఆకు కూరలు, కూరగాయలు కూడా ... మిగతా 8వ పేజీలో



స్థానికంగా లభించే సరకులతో తయారుచేస్తున్న కషాయాలు, ఎరువులు

వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేస్తాం



ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని గుర్తించి అక్కడ రైతులందరూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చూడాలన్నది లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ప్రారంభించనున్నాం. ఇందుకోసం ప్రస్తుతం గ్రామాల ఎంపిక పై అధికారులు సర్వే చేపట్టారు. గ్రామాల ఎంపిక పూర్తయిన తరువాత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమం విజయవంతమ వుతుందని ఆశిస్తున్నాం.

\- బి.మోహనరావు,
జిల్లా వ్యవసాయాధికారి



మునగపాకలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లాలో 94 శాతం పింఛన్లు పంపిణీ

అనకాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తొలిరోజైన శనివారం 94 శాతం పంపిణీ చేసినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి తెలిపారు. జిల్లా 2,56,274 మంది లబ్ధిదారులు ఉండగా, తొలిరోజు 2,41,666 మందికి (94 శాతం) పంపిణీ పూర్తి చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఇంకా కేవలం 14,608 మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, వలస వెళ్లిన కారణంగా వీటిని పంపిణీ చేయలేదన్నారు. సోమవారం నాటికి మిగిలిన లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.

ఢిల్లీ అమృత్ మహోత్సవ్‌కు హస్త కళాకారుడు శరత్

- రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం



శరత్ (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి రాష్ట్రపతి భవన్ నుంచి తనకు ఆహ్వానం అందినట్టు ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్త కళాకారుడు, రాష్ట్ర అవార్డు గ్రహీత పెదపాటి సత్యనారాయణ(శరత్)తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటికొప్పాక ప్రసిద్ధి చెందిన అంకుడు కర్రతో సహజసిద్ధ రంగుల మేళవింపుతో తయారు చేసిన లక్కబొమ్మల ప్రదర్శన ఉంటుందని, ఈ అరుదైన ఆహ్వానం అందినందుకు ఆనందంగా ఉందన్నారు.

ఏయూను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యం



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

అంకితభావంతో పనిచేస్తా

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి
- గ్రామీణ ప్రాంతాలకు వర్సిటీ అనుసంధానం
- పరిశ్రమలకు చెందిన నిపుణుల సేవలు వినియోగించుకుంటాం
- కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా లీడర్ షిప్ అకాడమీలు, క్లబ్స్ ఏర్పాటు
- శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు
- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్
- వీసీగా బాధ్యతలు స్వీకరణ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా అంకిత భావంతో పనిచేస్తానని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టిన ఆయన అనంతరం సెనేట్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రతిష్ఠాత్మక వర్సిటీకి వీసీగా నియమించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు రాజశేఖర్ చెప్పారు. యూనివర్సిటీ వందేళ్ల వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో అనేక సవాళ్లు తన ముందున్నాయన్నారు. వాటిని అధిగమిస్తూ ... మిగతా 8వ పేజీలో

అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి దూరంగా ఉంటా

- వీసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తన పని తీరు ఎలా ఉండబోతోందో వర్సిటీ వర్గాలకు సంకేతాలను పంపించారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చే వారు శాలువాలు తీసుకు రావద్దంటూ ముందే సర్క్యులర్ జారీ చేయించిన ఆయన... బాధ్యతలు స్వీకరణ అనంతరం ప్రతిజ్ఞ కూడా చేశారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి దూరంగా ఉంటానంటూ ఉద్యోగులు, అధికారుల ముందు ప్రమాణం చేశారు. అంకితభావంతో వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్‌లతో నిర్వహించిన సమావేశంలో కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు.

'ఎవరెక్స్' ఫార్మాలో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు





క్షతగాత్రులు రాజేశ్వరరావు, పెంటయ్య నాయుడు

అచ్యుతాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల సెజ్‌లోని ఎవరెక్స్ ఫార్మా కర్మాగారంలో శనివారం మధ్యాహ్నం ప్రమాదం సంభవించింది. రసాయనాలు కలుపుతుండగా మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న సివ్వం రాజేశ్వరరావు, పల్నాటి పెంటయ్య అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు.

'సాహితీ ఫార్మా' ప్రమాద కారణాలపై స్పష్టత శూన్యం

- బయటకు వచ్చిన నివేదిక
- పునరావృతం కాకుండా సూచనలు లేవు
- తీవ్రంగా విభేదించిన ప్రజా శాస్త్రవేత్తల బృందం

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలో 20 నెలల క్రితం సాహితీ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై కమిటీ ఇచ్చిన నివేదిక ఎట్టకేలకు బయటకు వచ్చింది. 2023 జూన్ నెలలో రీబాయిలర్ పేలి పది రోజుల వ్యవధిలో ఆరుగురు కార్మికులు చనిపోయారు. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు సరైన నష్టపరిహారం ఇవ్వలేదని ప్రజా శాస్త్రవేత్తల బృందం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించింది. ఫార్మా కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని తీసుకోవడం లేదని, అందువల్లనే ప్రమాదాలు ... మిగతా 8వ పేజీలో


రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.08
సహరి (సోమ)	4.59

నిలకడగా నీటిమట్టాలు

స్థిరంగా జలాశయాల్లో నిల్వలు

- సాగునీటి కష్టాలు ఉండవని రైతుల ఆశాభావం



పెద్దేరు జలాశయంలో జలకళ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు స్థిరంగా ఉన్నాయి. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాల నేపథ్యంలో జిల్లాలో జలాశయాల్లో నీరు చేరింది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం జలాశయాల్లో నీటి నిల్వలు స్థిరంగా కొనసాగుతుండడంతో సాగునీటి కష్టాలు ఉండవని రైతులు భావిస్తున్నారు.

పెద్దేరు, కోనాం, వరహాలో గతేడాది కంటే నీరు తక్కువగా ఉంది. తాండవ, రైవాడ జలాశయాల్లో గతేడాది కంటే నీటిమట్టం ఎక్కువగా ఉంది. తాండవ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులు కాగా, శనివారం నాటికి 365 అడుగులు ఉంది. రైవాడ జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 112.66 మీటర్లు ఉంది. కోనాం జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 101.25 మీటర్లు కాగా, 97.10 మీటర్లు, వరహా జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 452 అడుగులు, పెద్దేరు జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 137 మీటర్లు కాగా, శనివారం నాటికి 137 మీటర్లు ఉంది. జిల్లాలో జలాశయాల పరిధిలోని పంట కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో తాండవ జలాశయానికి రూ.48.30 లక్షలు, పెద్దేరుకు రూ.2 కోట్లు, రైవాడకు రూ.75 లక్షలు, కోనాంకు రూ.10.01 లక్షలు నిధులు కేటాయింపులు జరిపారు. ఈ నిధులతో జలాశయాల పరిధిలోని పంట కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు నిర్వహించనున్నట్టు జలవనరుల శాఖ ఇంజనీర్లు చెబుతున్నారు. దీంతో రైతులు ఈ ఏడాది సాగునీటి కష్టాలు తీరనున్నాయని ఆశిస్తున్నారు.

జిల్లాలో జలాశయాల్లోని నీటి నిల్వలు శనివారం నాటికి ఇలా...

జలాశయం	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
తాండవ	380.00	365.00 అడుగులు
రైవాడ	114.00	112.66 మీటర్లు
కోనాం	101.25	97.10 మీటర్లు
వరహా	460.00	452.00 అడుగులు
పెద్దేరు	137.00	135.00 మీటర్లు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జనరల్ విద్యార్థులు 10,832 మంది, ఒకేషనల్‌లో 2,313 మంది హాజరు



అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్‌లో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో శనివారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 11,132 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 10,832 మంది హాజరయ్యారు. 300 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 2,523 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 2,313 మంది పరీక్ష రాశారు. 210 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు నిర్వహించారు.

పరీక్షలు రాయాలంటే 25 కిలో మీటర్లు వెళ్లాల్సిందే..



ఆటోల్లో పరీక్షా కేంద్రానికి వెళ్లి వస్తున్న విద్యార్థినులు

చీడికాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల మోడల్ కళాశాలలో పదేళ్ల క్రితం పరీక్షా కేంద్రాన్ని తొలగించడంతో మూడు కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు 25 కిలో మీటర్లు ప్రయాణించి చోడవరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉదయాన్నే ఆటోల్లో చోడవరం వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. కోనాం బాలయోగి గురుకుల కళాశాల, మంచాలలో మోడల్ కళాశాల, జి.కొత్తపల్లి కేజీబీవీ కళాశాలలో 250 మంది ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. మంచాల మోడల్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తొలగించడంతో వీరంతా చోడవరంలోని పరీక్షా కేంద్రానికి 25 కిలో మీటర్లు ప్రయాణించి వెళ్లాల్సి వస్తోంది. ఏదైనా అవాంతరం ఏర్పడితే పరీక్షలకు హాజరుకావడం కష్టమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి మంచాల మోడల్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇటొస్తే ఇరుక్కుపోయినట్టే..

మెయిన్ రోడ్డులో సంతతో ఇబ్బందులు

- ట్రాఫిక్ స్తంభించడంతో పరీక్షా కేంద్రాలకు చేరడానికి విద్యార్థుల అవస్థలు



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన విద్యార్థులు

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్ వల్ల విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సంత రోజు రోడ్డుకు ఇరువైపులా నేల దుకాణాలు, ఆకుకూరలు, కాయగూరలతో వచ్చే ఆటోలతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, అంబేడ్కర్ బాలిక కళాశాలలు ఇక్కడ ఉన్నాయి. శనివారం ట్రాఫిక్ నిలిచిపోయి ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ డిగ్రీ కళాశాలను ఆనుకొని కోర్టు సముదాయం ఉంది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు ఈ రోడ్డులో వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. అయ్యన్నకాలనీ, నీలంపేట, గబ్బాడ ప్రజలు ప్రతీ చిన్న అవసరానికి ఇటువైపు నుంచే నర్సీపట్నం రాకపోకలు సాగిస్తుంటారు. మెయిన్ రోడ్డులో సంత నిర్వహించడం వల్ల ప్రజలు, కోర్టు పని మీద వచ్చేవారు, కళాశాల విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. ఒక్కొక్కసారి 108 అంబులెన్స్‌కి దారివ్వని పరిస్థితి ఉంది. కొవిడ్ సమయంలో నర్సీపట్నం కూరగాయల మార్కెట్‌ను ఇక్కడకు తరలించిన అధికారులు తరువాత పట్టించుకోలేదు. ఇందిరా మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులు చాలా మంది ఇక్కడ నేల దుకాణాలు వేసుకొని అమ్ముకుంటున్నారు. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. శనివారం సంత రోజు అయితే పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది.

పింఛనర్ల నుంచి ఏదైనా ఆశిస్తే చర్యలు

- సిబ్బందికి కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరిక
- మునగపాకలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ


దివ్యాంగురాలికి పింఛన్ నగదును అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మునగపాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మునగపాకలో శనివారం ఆమె పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఇంచుమించుగా ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీ పూర్తి జరుగుతోందన్నారు. లబ్ధిదారులను రప్పించుకునే పద్ధతిని వీడాలని అధికారులకు స్పష్టంగా ఆదేశించినట్టు చెప్పారు. పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది లబ్ధిదారుల నుంచి ఏదైనా ఆశిస్తే అటు వంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వికలాంగులకు రూ.ఆరు వేలు, వృద్ధాప్య, వితంతులకు రూ.నాలుగు వేలు చొప్పున నగదు అందజేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 8337 మంది లబ్ధిదారులకు రూ.3.43 కోట్లు నగదు పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. కాగా కలెక్టర్ దృష్టికి స్థానికులు పలు సమస్యలు తీసుకు వచ్చారు. రోడ్డు విస్తరణ, ట్రాఫిక్, మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ తదితర సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆది ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ఎలమంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలంటూ మునిసిపల్ కార్మికులంతా శనివారం ఇక్కడ కమిషనర్ ప్రసాదరాజుకు వినతి పత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా కోరారు. అనం తరం పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీన కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహించ తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్ర మాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గనిశెట్టి ఏసు దాసు, నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, డి.మహేష్, రవి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రగడ'ను పరామర్శించిన తాతయ్యబాబు


ప్రగడ నాగేశ్వరరావును పరామర్శిస్తున్న బత్తుల తాతయ్యబాబు

అచ్యుతాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు శనివారం పరామర్శించారు. ప్రగడ అనారోగ్యానికి గురైనట్టు తెలుసుకుని అచ్యుతాపురంలో గల ఆయన నివాసానికి వెళ్లిన తాతయ్యబాబు యోగక్షేమాలు అడిగితెలుసుకు న్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ బాబు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్, మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సాయి, ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు, రెడ్డి నగేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలి: రేగుపాలెం ర్యాలీలో ఐసీడీఎస్ పీవో, విద్యార్థినులు


రాంబిల్లి హైస్కూల్ మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి

'మహిళా వికాసంతోనే దేశ ప్రగతి'


మునగపాక స్టేషన్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

ఎలమంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత వారోత్సవాలను నియోజకవర్గంలో పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా ఎల మంచిలి మండలంలోని రేగుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఇందిరాదేవి ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నింటా రాణించాలన్నారు. విద్యార్థినులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మహిళా వికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేశ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుహాసిని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక : మహిళలు అన్నిరంగాల్లో సమర్థత చాటుకుంటున్నారని ఎస్ఐ పి.ప్రసాదరావు అన్నారు. ఇక్కడి పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం మహిళా సాధికారత వారోత్సవాలనునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం నేడు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎటువంటి మోసాలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు వాటిని ఏ విధంగా ఎదుర్కొవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఇక్కడి పోలీస్ స్టేషన్ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళా పోలీసులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావ్య వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లి హైస్కూల్‌లో మహిళా సాధికారత వారోత్సవాలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వేణు గోపాలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థినులు ఇప్పటి నుంచి చదువుతో పాటు ప్రతి అంశంపై అవగాహన పెంచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించ్చునన్నారు. పలువురు మహిళలను సత్కరించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


అచ్యుతాపురం స్టేషన్‌లో మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు

ప్రశాంతంగా తొలిరోజు ఇంటర్ పరీక్ష

అచ్యుతాపురంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్


ఎలమంచిలిలోని పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటైన సెంటర్‌ను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది, ఎంతమంది హాజరయ్యారు తదితర వివరాలపై డీవీఈవో సుజాత ద్వారా ఆరా తీశారు. 63 మంది ఆబ్సెంట్ అయ్యారని ఆమె చెప్పడంతో పరీక్షలకు విద్యార్థులు ఆబ్సెంట్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.కుసుమాపతి, డిపార్ట్‌మెంటల్ అధికారి సురేష్ కుమార్ తదితరులకు ఆమె పలుసూచనలు చేశారు. ఇదిలావుంటే, ఇక్కడ ప్రశాంతి పాలిటెక్నిక్, కైట్స్ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలకు అధికారులు ప్రకటించారు. అచ్యుతాపురం జంక్షన్‌కు కూత వేటు దూరంలో కైట్స్ కళాశాల ఉండగా, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల మాత్రం సుమారు కిలోమీటరు దూరంలో ఉంది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాలపై వచ్చిన విద్యార్థులు నడిచి వెళ్లాల్సి వచ్చింది. పరీక్షకు సకాలంలో చేరాలన్న తాపత్రయంతో పలువురు పరుగు తీశారు.

ఎలమంచిలి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం పరీక్షలకు జూనియర్ కళాశాలలో 477 మంది విద్యార్థులకు 465 మంది, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో 575 మందికి గాను, 564 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు.

సంపద కేంద్రాలను తనిఖీ చేసిన డీపీవో శిరీషారాణి


పంచదార్లలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో

రాంబిల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జిల్లా పం చాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి పర్యటించారు. తొలుత హరిపురం, పంచదార్ల గ్రామాల్లోని సందప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులతో మాట్లాడుతూ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అక్కడి నుంచి రాంబిల్లిలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె రాంబిల్లి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రామారావు పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని, రికార్డులు సీజ్‌చేసి నాలుగు రోజుల్లో విచరణ జరపాలన్నారు. సదరు నివేదికను తనకు అందజేయాల్సిందిగా ఈవోపీఆర్‌డీ రాజును ఆదేశించారు.

ప్లాస్టిక్ నిషేధంపై ఫ్లెక్సీలు ఏర్పాటు

ఎలమంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు పట్టణంలోని పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, తదితరాలను ప్రజలు వినియోగించరాదని వాటిలో పేర్కొన్నారు.

245 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎలమంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ములకలాపల్లిలో మైహోమ్ సిమెంటు పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొత్తలి, బయ్యవరం, పురుషోత్తపురం గ్రామాల్లోని పాఠశాలలకు చెందిన 245 మంది విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపినట్టు సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ బి.రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీజీఎం ఎల్.శ్రీనివాసరావు, ఓహెచ్‌సీ ఇన్‌చార్జ్ రాజు, వైద్యులు సాంబమూర్తి, మేఘన, భానుతేజ, ధనుంజయ్‌లతో పాటు ఆయా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూలజంపలో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

రాంబిల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలజంపలో శనివారం హెరిటేజ్ పాలసేకరణ కేంద్రాన్ని డెయిరీ మేనేజర్ కూంద్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి సంస్థ పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. మాజీ సర్పంచ్ వేగి రాము, హెచ్‌పీఆర్ కె.అప్పారావు, నాయకులు నాగబాబు, సన్యాసినాయుడు, రామసత్యనారాయణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్


కాలువల్లో పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

పాయకరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలువల్లో పూడికలు, ఎక్కడికక్కడ చెత్తాచెదారం తొలగించారు. ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పాయకరావుపేట పట్టణంతో పాటు మండలంలోని పెదరాంభద్రపురం తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా తరచూ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. చెత్తను కాలువలు, రోడ్లపై పడేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వేసి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన కోరారు. అనంతరం గ్రామాల్లో శనివారం జరుగుతున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్

కోటవురట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సందర్శన కోసం వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులకు స్టేషన్‌లో పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితనాన్ని ఎస్ఐ రమేశ వివరించారు. అదేవిధంగా పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. వేధింపులు, ప్రమాదం సంభవిస్తే భయపడకుండా పోలీసులకు సమచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు. అలాగే మహిళా కానిస్టేబుళ్లకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహించగా, డాక్టర్ అనూష పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నక్కపల్లిలో...


ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

నక్కపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయం బాలికలకు శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్‌లో ఛాంబర్లు, లాకప్ రూమ్, పోలీస్ విధులు, ఆయుధాలపై సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


పాయకరావుపేట కేంద్రంలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


నక్కపల్లి కేంద్రంలో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పాయకరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం సజావుగా ప్రారంభమయ్యాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా జరిగాయి. పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని కేంద్రాల్లో స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. పాయకరావుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు శ్రీప్రకాష్ విద్యా సంస్థలు, కార్తికేయ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు సాంస్కృతం, తెలుగు పరీక్షను ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీప్రకాష్, కార్తికేయ జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 1,240 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. మాస్ కాపీయింగ్ ఎటువంటి ఆస్కారం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్షల నిర్వాహకులు తెలిపారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: స్థానిక బాలికల గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, గురుకులం ప్రిన్సిపాల్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం కనిపించింది. పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ విధించారు.

వైభవంగా గౌరీశంకరుల తీర్థ మహోత్సవం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు వేషధారణలు

అమ్మవారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు



గౌరీదేవి అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులు... జాతరలో అలరించిన శక్తి వేషాలు

పాయకరావుపేట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలో గౌరీశంకరుల తీర్థ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా మార్చిలో గౌరీశంకరుల జాతర మహోత్సవాన్ని 150 సంవత్సరాలుగా జరుపుకోవడం సంప్రదాయకంగా వస్తున్నదని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి గౌరీదేవి జాతర తరువాత సత్యవరంలోనే అత్యంత వైభవంగా జరుపుతారు. ఈ జాతరలో బాణసంచా పేలుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతర సందర్భంగా వీధులన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. జాతరలో గరగర నృత్యం, శక్తి వేషాలు, భక్తులను అలరించాయి. శనివారం తెలవారు జాము నుంచే భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే కల్పతల్లిగా గౌరీదేవి అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గుడి చుట్టూ పెట్రోమ్యాక్స్ లైట్లను తిప్పారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు తోట నగేశ్, గెద్దం బుజ్జి, వైసీపీ నియోజక వర్గ కన్వీనరు కంబాల జోగులు, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, టీడీపీ, వైసీపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఖరీఫ్ నాటికి సాగునీటి మదుముల మరమ్మతు

- నీటిపారుదల శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి

పాయకరావుపేట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆవ కాలువ పరిధిలోని గోపాలపట్నం, పెంటకోట సాగునీటి కాలువలపై మదుములు, గేట్లను వచ్చే ఖరీఫ్ నాటికి మరమ్మతులు చేపట్టేలా ప్రతిపాదనలు చేస్తున్నట్టు నీటిపారుదల శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. శనివారం పెంటకోట వద్ద పాటి కాలువ, ఇసుక కాలువలపై మదుములను, గేట్లను పరిశీలించారు. అనంతరం పెదరాంభద్రపురం వద్ద ఊడిపల్లపు కాలువ గట్టును ఆక్రమించిన ప్రాంతంలో మండల సర్వేయరుతో సర్వే చేయించారు. సుమారు వంద మీటర్ల మేర తొలగించిన గట్టును తిరిగి పునరుద్ధరించాలని స్థల యజమానికి ఏఈఈ ఆదేశించారు.


పెదరాంభద్రపురం వద్ద సాగునీటి కాలువ గట్టు సర్వే చేస్తున్న ఏఈఈ, సర్వేయర్

భూ సేకరణపై సమావేశం

నక్కపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతీనార్ల, సీహెచ్ఎల్.పురం గ్రామాల్లో రెండో విడత భూ సేకరణకు సంబంధించి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ గ్రామాల పరిధిలో 515 ఎకరాల పట్టా భూమిని సేకరించేందుకు సోమవారం నుంచి సర్వే చేస్తామని ఎస్‌డీసీ అనిత చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహమూర్తి, సీఐ కుమారస్వామి, సర్పంచులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ చైర్మన్ భర్తపై కత్తితో దాడి

దేవరాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ అల్లం కాసులమ్మ భర్త వెంకునాయుడుపై అదే గ్రామానికి చెందిన కాటిపాము ఆనంద్ శనివారం కత్తితో దాడి చేశాడు. ఈదాడిలో వెంకునాయుడు తలపై తీవ్ర గాయం కావడంతో దేవరాపల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తెనుగుపూడి పాఠశాలలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవం పార్టీకి పిల్లల నుంచి ఉపాధ్యాయులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారంటూ ఎంఈవోకి ఫిర్యాదుచేశారు. ఈ విషయమై ఆనంద్‌ను అడగడా నికి వెళ్లిన తనను అతని తండ్రి పట్టుకోగా ఆనంద్ కత్తితో దాడి చేశాడని వెంకునాయుడు విలేకరులకు తెలిపారు. కాగా ఇదేవిషయం ఆనంద్ వద్ద ప్రస్తావించగా వార్షికోత్సవానికి డబ్బులు వసూలు చేశారని ఎంఈఓకు ఫిర్యాదు చేశారనే అక్కసుతో వెంకునాయుడు రెండుసార్లు కత్తితో కొట్టాడన్నారు. తాను కత్తి పట్టుకొని జీడితోటలో తుప్పలు నరకడానికి వెళుతున్న సమయంలో ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో కత్తిపిడి అతని తలపై తగిలిందని తప్పదాడి చేయలేదన్నారు. ఈ విషయమై ఎస్ఐ టి.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. ఫిర్యాదు అందలేదన్నారు.

కొట్లాటలో ఒకరికి గాయాలు

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి ప్రాంగణంలో భూ వివాదం విషయమై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు శనివారం ఘర్షణకు దిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చీడికాడ మండలం బయలపూడి అగ్రహారానికి చెందిన గోకాడ సూర్యనారాయణ, గోకాడ కాసులకు మధ్య పొలంలో దారి విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో గోకాడ కాసు శనివారం ఉదయం పొలంలో వెళుతుండగా, గోకాడ సూర్యనారాయణ కాసుతో వాదనకు దిగడంతో సూర్యనారాయణ, కాసును కొట్టాడు, ఈ సమాచారం తెలిసిన కాసు కుమారులు తమ తండ్రిపై దాడి చేసిన సూర్యనారాయణకు దేహశుద్ధి చేసి, అక్కడ నుంచి గాయపడిన తమ తండ్రిని చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. దీంతో సూర్యనారాయణ మరోసారి కాసు చికిత్స పొందుతున్న స్థానిక ఆసుపత్రికి వచ్చి మరోసారి కాసు కుటుంబీకులతో ఘర్షణకు దిగడంతో, ఇరుపక్షాల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా కాసు కుటుంబీకులు సూర్యనారాయణను తీవ్రంగా కొట్టారు. గాయపడిన సూర్యనారాయణను అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ఇరుపక్షాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు స్థానిక సీఐ బి.అప్పలరాజు తెలిపారు.

సారా తయారీ, విక్రయాలు నేరం

- పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు
- పేరంటాలపాలెం అవగాహన సదస్సులో ఎక్సైజ్ ఎస్ఐ గణేశ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ గణేశ్

కశింకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కె.సుబ్రహ్మణ్య గణేశ్ పిలుపునిచ్చారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేరంటాలపాలెంలో శనివారం రాత్రి గ్రామస్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. సారా తయారీ, విక్రయాలు, రవాణా వంటివి నేరమన్నారు. ఇవి చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం కఠినంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. దీని వల్ల కుటుంబాలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సారా తాగడం వల్ల తీవ్ర అనారోగం సోకుతుందన్నారు. పల్లెల్లోని ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించి సారాను నిర్మూలనకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించి, ప్రజలకు భద్రత కల్పించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రం కావడంతో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతోందన్నారు. ఫలితంగా వాహనచోదకులు తరుచూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి, వాటిపై ప్రజలు నడిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జెడ్సీని కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గసభ్యులు బొడ్డు సోమురాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సమస్యలపై ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం



దీక్షలో కూర్చొన్న వారికి మద్దతు తెలుపుతున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు శనివారం రిలే దీక్షలు ప్రారంభించారు. అనకాపల్లి డిపో మేనేజర్ 1/2019 సర్క్యులర్ అమలు చేయకుండా ఏకపక్షంగా కండక్టర్ ఎస్ఎస్ నారాయణను సస్పెండ్ చేయడం తగదన్నారు. ఏడు రోజులుగా ఆందోళనలు చేపడుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని యూనియన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు వి.అప్పారావు, జోనల్ ఇన్‌చార్జి కార్యదర్శి బి.ఎస్.రాములు, జిల్లా కార్యదర్శి పి.శంకరరావు, జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ రాజు, పి.సుధాకర్‌లు దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలిపారు.

'భవన నిర్మాణ రంగంలో సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్

కొత్తూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ కోరారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలో శనివారం భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో లక్షలాది మంది కార్మికులు పనులు చేస్తున్నారన్నారు. వర్షాభావ పరిస్థితులు, పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ వ్యవసాయ కూలీలంతా భవన నిర్మాణ కార్మికులుగా మారారన్నారు. ఈ కార్మికులందరికీ వైద్యం, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. కార్మికులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చీర అప్పలరాజు, మారేడిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విద్య ద్వారానే పేదరిక నిర్మూలన'



గురుకుల పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గారియన్

తుమ్మపాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సివిల్ సర్వీసెస్ మాజీ అధికారి కర్నల్ గారియన్ పేర్కొన్నారు. గవరపాలెం గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కేవలం విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించవచ్చునని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి



సబ్బవరం స్టేషన్ ఆవరణలో మహిళలకు వైద్య పరీక్షలు



కశింకోట స్టేషన్‌లో పోలీసుల సేవలను విద్యార్థినులకు వివరిస్తున్న సీఐ

మహిళలు అన్నింటా రాణించాలి

- మహిళా సాధికారత వారోత్సవాల్లో వక్తలు
- 'ఆడపిల్లల్ని బతకనివ్వాలి.. ఎదగనివ్వాలి' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు
- చట్టాలపై పలుచోట్ల అవగాహన సదస్సు

అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత వారోత్సవాలను శనివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. నెహ్రూచౌక్ నుంచి సాగిన ఈ ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.అనంతలక్ష్మి, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ గౌతమ్‌ల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆడ పిల్లలు పుట్టడం ఒక వరమన్నారు. ఆడపిల్లల్ని బతకనివ్వాలి, ఎదగనివ్వాలి అని పేర్కొన్నారు. అనంతరం ఆమె పలువురికి కొత్త బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎంవీ మంజులావాణి, ఏసీడీపీ ఒ.శశికళ, సీనియర్ అసిస్టెంట్ మొహిద్దీన్, లైజనింగ్ ఆఫీసర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులకు చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఇక్కడి మహిళా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళల భద్రత కోసం



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఎం.శ్రావణి

ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మెడికల్ క్యాంప్, ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు చేపట్టారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : చట్టాలు, బాలికలు, మహిళల భద్రత తదితర అంశాలపై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. మహిళా సాధికారత వారోత్సవాలను ఇక్కడి పోలీసు స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను పోలీసు స్టేషన్‌కు ఆహ్వానించి ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే సహాయ హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112, 181, 1098లను తెలియజేశారు. అదే విధంగా మహిళా పోలీసు సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె.లక్ష్మణరావు, పి.మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : మహిళా సాధికారత వారోత్సవాల సందర్భంగా ఇక్కడి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్టేషన్‌లోని మహిళా సిబ్బందితో పాటు పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ దివ్య మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉన్నట్టేనని పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ విద్యాధరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ 'ప్రథమ' పరీక్ష ప్రశాంతం

- ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేపట్టిన అధికారులు
- సకాలంలో చేరుకున్న విద్యార్థులు



ఆదినారాయణ మహిళా కళాశాల కేంద్రం వద్ద విద్యార్థినీ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని సంయుక్త, డాక్టర్ హిమశేఖర్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కళాశాలలతో పాటు ఆదినారాయణ మహిళా కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, ఏఎంఏఎల్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఆయా కేంద్రాలకు విద్యార్థినీ విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటలకే రావడం ప్రారంభించారు. ఎనిమిదిన్నర గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. తొమ్మిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు.

కొత్తూరు : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు.

పరవాడలో 491 మంది హాజరు...

పరవాడ : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు 498 విద్యార్థులకు గాను 491 మంది పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ జామి లక్ష్మీకుమారి తెలిపారు. విద్యార్థులంతా అరగంటకు ముందే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

సబ్బవరంలో 580 మంది హాజరు...

సబ్బవరం : ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడి గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాంలో 289 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా 282 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.రామకృష్ణ తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 306 మంది విద్యార్థులకు 298 మంది హాజరయ్యారని సీఎస్ పి.శుభాషిణి వివరించారు.



కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల వద్ద...

పింఛన్ల పంపిణీని పరిశీలించిన డీఆర్‌వో



లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

కశింకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పరిశీలించారు. పింఛన్ల నగదును సకాలంలో ఆయా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. మండల వ్యాప్తంగా 10,221 మంది పింఛనర్లు ఉండగా, 9818 మందికి అందజేసినట్టు అధికారులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మిగిలిన 402 మంది అందుబాటులో లేరని చెప్పడంతో ఆదివారం వీటిని పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

'శ్రద్ధగా చదివితే ఉజ్వల భవిష్యత్తు'



వసతి గృహం పరిసరాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారిణి సుభాషిణి

కశింకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారిణి వి.ఎల్.సుభాషిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో బాలికలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవికుమార్, హాస్టల్ వార్డెన్ నిర్మల తదితరులున్నారు.

వేడుకగా పోలమాంబ ఘటాల ఊరేగింపు



ఈ.బోనంగిలో ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో ఈనెల మూడు, నాలుగు తేదీల్లో రెండు రోజు పాటు పోలమాంబ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి తొలి ఘటాల ఊరేగింపు శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను పెద్దింటి నుంచి తీసుకొచ్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పూజలు చేసి కానుకలు సమర్పించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు జోడి ఘటాల ఊరేగింపు కొనసాగుతాదని నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టా సన్యాసిఅప్పారావు, మాజీ ఉప సర్పంచ్ బుగిడి రామగోవిందరావు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణ, సూర్యనారాయణ ఆలయ హుండీ లెక్కింపు



అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సుంకర మెట్ట జంక్షన్‌లో గల సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి వార్ల ఆలయ హుండీ లెక్కింపు శనివారం చేపట్టారు. ఈవో బి.మురళీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియను జరిపారు. కానుకల రూపంలో రూ.2,35,663ల ఆదాయం ఆలయానికి లభించిందని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ మురళీ తెలిపారు. గత ఏడాది కంటే ఎక్కువగా లభించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నేటి నుంచి రంజాన్ మాసోత్సవాలు ప్రారంభం'

అనకాపల్లి టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు అత్యంత ప్రియమైన రంజాన్ నెల ఆదివారం నుంచి ప్రారంభం కానుందని ఇక్కడి జామియా మసీదు కమిటీ అధ్యక్షులు పీఎస్ఎన్ హుస్సేన్ తెలిపారు. ఉదయం ఉపవాసం మొదలుపెట్టి ప్రార్థనలు చేసి, సాయంత్రం కేటాయించిన సమయానికి ఉపవాసం విరమించడం జరుగుతుందన్నారు. నెల రోజులపాటు అత్యంత నిష్టగా ముస్లింలమంతా ఈ దీక్షలు చేస్తావని వివరించారు.

క్వారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా క్వారీ, క్రషర్స్ కార్మికుల సంఘం ప్రతినిధి మోహన్‌రావు డిమాండ్
- విశాఖలో 5న జరిగే చర్చలకు యాజమాన్యాలు రావాలని విజ్ఞప్తి

తుమ్మపాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీ కార్మికుల సమస్యలను ఆయా యాజమాన్యాలు పరిష్కరించాలని అనకాపల్లి జిల్లా క్వారీ, క్రషర్స్ కార్మికుల సంఘం నాయకుడు కోన మోహన్‌రావు కోరారు. అనకాపల్లి మండలం బవులువాడలో శనివారం జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. క్వారీ, క్రషర్ల లాభాలకు కారణమైన కార్మికుల కూలీ రేట్లు పెంచాల్సిన యాజమాన్యాలు స్పందించకపోవడం దారుణమన్నారు. వేతన ఒప్పంద కాల పరిమితి ముగిసి రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి ఈ సమస్యలు తీసుకు వెళ్లినా ఫలితం కానరావడం లేదని ఆరోపించారు. ఈ నెల ఐదో తేదీన విశాఖపట్నంలోని కార్మికశాఖ కార్యాలయంలో జరగనున్న ఇరువర్గాల చర్చలకు యాజమాన్యాలు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ చర్చల్లో కార్మికులకు న్యాయం జరగకుంటే భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో క్వారీ కార్మికుల సంఘం ప్రతినిధులు సీహెచ్.రమేష్, ఎస్.అప్పలనాయుడు, జి.చిన్న, విష్ణు, జగ్గారావు, దుర్గా అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న సంఘం ప్రతినిధులు

ఇంటర్వ్యూ..

ధాన్యం కొనుగోలు పూర్తి

పోతల సత్యనారాయణ, ఏవో, సబ్బవరం



ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ఏడాది 232 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.53.36 లక్షలు చెల్లించాం. రబీ పంటలు సాగుచేసే రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. మండలంలో రైతు రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం చేశాం.

ప్రశ్న : మండలంలో ధాన్యం కొనుగోలు ప్రకియ ఎలా జరుగుతుంది.

జవాబు: మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంత వరకూ 102 మంది రైతుల నుంచి 232మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతులకు రూ.53.36 లక్షలు చెల్లించాం. దీంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యింది.

ప్రశ్న : రబీ సాగులో చీడపీడల నివారణకు ఎటువంటి సలహాలు ఇస్తున్నారు?

జవాబు: రబీ సీజన్‌లో రైతులు అపరాలు, నువ్వులు సాగు చేస్తుంటారు. అపరాలకు రసం పీల్చే పురుగులు ఆశిస్తుంటాయి. వీటి నివారణకు క్లోరీఫైరీఫాస్ లేదా మోనోక్రోటోపాస్ లీటరు నీటిలో రెండు ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు మాంకోజెబ్ రెండు ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న: రాయితీపై రైతులకు ఎటువంటి యంత్ర పరికరాలను సమకూర్చింది?

జవాబు : త్వరలో యంత్ర పరికరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులు కోరుతుంది. ట్రాక్టర్ యంత్రాలైన దుక్కి/ దమ్ము సెట్లు, కలుపు యంత్రాలు, పవర్/సాధారణ స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు రాయితీపై ఇస్తారు. టెండరు కూడా పూర్తయింది.

ప్రశ్న : రైతు రిజిస్ట్రీ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది ?

జవాబు : మండల వ్యాప్తంగా 8,300 మంది రైతులు ఉన్నారు. ఇంత వరకూ 6,822 మంది తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. సంక్షేమ పథకాలు ఈ రిజిస్ట్రీ ప్రక్రియ వలన వచ్చే ఐడీ కార్డు ద్వారా పొందే వీలు ఉంటుంది. - సబ్బవరం

క్రికెట్ పోటీల విజేత అంతర్ల కాలనీ



విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

చింతపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంతర్ల సోమలింగేశ్వర స్వామి జాతర పురస్కరించుకుని నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో అంతర్ల కాలనీ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం అంతర్ల కాలనీ, ద్వితీయ స్థానం శివాలయం వీధి క్రీడాకారులు గెలుచుకున్నారు. ప్రథమ స్థానం పొందిన జట్టుకు ఎంపీపీ కోరాబు అనుషదేవి, ద్వితీయ స్థానం దక్కించుకున్న క్రీడాకారులకు జడ్పీటీసీ సభ్యుడు వ్యక్తిగత నిధులతో జ్ఞాపికలు, క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శోభ బాలకృష్ణ, కవడం శివ సంతోష్, రాంప్రసాద్, సోమరాజు, కోరాబు లింగన్న పడాల్, నరేష్ పాల్గొన్నారు.

213 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చింతపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం ఏర్పాటుచేసిన మెగా కంటి వైద్యశిబిరంలో 213 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎం. విజయ భారతి తెలిపారు. శనివారం అధ్యాపకులు, శంకర్ ఫౌండేషన్ అధికారులు సంయుక్తంగా ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యశిబిరంలో శస్త్రచికిత్సలు అవసరమైన బాధితులను గుర్తించి మైదాన ప్రాంతాలకు పంపించామన్నారు. కొంతమందికి కళ్ల అద్దాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ అధికారి సమ్మద్ దేశ్‌మఖ్, మేనేజర్ చంద్రశేఖర్, అప్తాలమిక్ జానిజాన్సన్ పాల్గొన్నారు.

కార్మికులంతా కలిసికట్టుగా పని చేయాలి



కొత్త సభ్యులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న జిల్లా గౌరవాధ్యక్షుడు రామారావు

పాడేరురూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి మన్యం ప్రాంతానికి వచ్చి పనులు చేస్తున్న కార్మికులు కలిసికట్టుగా పనిచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు సూచించారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు.ఎలక్ట్రీషియన్, కార్పెంటర్స్, తాపీమేస్త్రీలు, పెయింటర్స్ పాల్గొన్నారు. ఈసందర్భంగాఆయా కార్మికుల మధ్య నిర్మాణ పనుల సమయంలో తలెత్తుతున్న సమస్య చర్చించారు. నూతనంగా అసోసియేషన్‌లో సభ్యత్వం పొందిన కార్మికులకు గుర్తింపు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, బొంజుబాబు, నానాజీ, ఎస్.దామోదరం, పి.బబ్లూ, ఎం.స్వామినాయుడు, పి.శేఖర్, బి.ప్రకాశరావు, ఎల్.గిరిపాత్రుడు పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితులకు అన్యాయం'

పాడేరురూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పాచిపెంట అప్పలనర్స అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ. 17 వేల కోట్లు, ఐటీడీఏల కు రూ. 100 కోట్లతో అరకొర కేటాయించినట్టు విమర్శించారు.



ర్యాలీకి జెండా ఊపుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ



జి.కె. వీధిలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు ,అంగన్‌వాడీలు

మహిళా సాధికారత సాధించాలి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ

పాడేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత దిశగా ప్రతి మహిళా, బాలికలు అడుగులు వేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ అన్నారు. ఈనెల 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఇక్కడ నిర్వహించిన 'భేటీ బచావో.. భేటీ పడావో' పేరిట చేపట్టిన సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా అభిషేక్‌గౌడ మాటాడుతూ ప్రతి మహిళా తన కాళ్లపై నిలబడేలా ముందుకు సాగాలని, ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. అలాగే బాలికల సంరక్షణ, వారి అభివృద్ధికి కృషిచేయాలని, మహిళలు, బాలికలకు ఉన్న చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించడంతోపాటు వాటిని అందరూ గౌరవించాలన్నారు. అలాగే గత 10, 15 ఏళ్లతో పోల్చితే మహిళలు అన్ని రంగాల్లో భాగస్వామ్యం ఉందని, కాని మరింత సాధికారత సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీ, డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్‌బాషా, డీఈవో బ్రహ్మజీరావు, టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని, ఎంఈవో సరస్వతి, సీడీపీవో ఝాన్సీరాణి, మహిళలు, పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలను శనివారం ప్రారంభించారు. భేటీ బచావో భేటీ పడావోలో భాగంగా విద్యార్థినులు సైకిల్ ర్యాలీని చేపటారు. అం గన్‌వాడీ కార్యకర్తలు థింసా నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంఈవో సుందర్రావు, మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కృష్ణకుమారి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.



డుంబిగుడ: సైకిల్ ర్యాలీలో విద్యార్థినులు

గూడెంకొత్తవీధి: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో ఎ.లక్ష్మిదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఐడీడీఎస్ అధికారులు బాలికల తల్లులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఈనెల 8న అం తర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బాలికల కుటుంబాల వద్దకు వెళ్లి తల్లుల పేరిట ఒక మొక్కను నాటిస్తున్నామన్నారు. అలాగే బాలికల హక్కులు, సాధికార, సమానత్వంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికలను తల్లిదండ్రులు పనులకు పంపించరాదని, బాల్యవివాహాలు చేయరాదన్నారు. అనం తరం బాలికల హక్కులపై ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో అం గన్‌వాడీ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, వలసమ్మ, కృష్ణకుమారి పా ల్గొన్నారు.

పశువులకు టీకాలు

పాడేరురూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖాధికారి నర్సింహులు కోరారు. శనివారం మండలంలోని సుంద్రపుట్టు గ్రామంలో పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. పశువుల్లో వచ్చే వివిధ వ్యాధులతో కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఇంటర్ పరీక్షలు

పాడేరురూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు డీఈవో పి.బ్రహ్మజీరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వాహణకు 8 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు 1,699 మంది అభ్యాసకులు హాజరు కానున్నారన్నారు. హాల్ టిక్కెట్‌లు సంబంధిత స్టడీ సెంటర్స్ లేదా విద్యా పీఠం వారి అధికార వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టిక్కెట్‌పై ఏఐ సెంటర్ కో-ఆర్డినేటర్‌తో సంతకం చేయించుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలలో వైద్య సేవలు, తాగునీరు, మౌలికవసతులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకుపరీక్ష జరుగుతుందన్నారు.అభ్యాసకులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. సమస్యలుంటే కంట్రోల్ రూమ్: 9490270788కు సంప్రదించాలని తెలిపారు.



కొయ్యూరులో పరీక్షలను పరిశీలిస్తున్న డీటీ కుమారస్వామి తదితరులు



పాడేరులో పరీక్షలకు హాజరైన ఏపీఆర్, కస్తూర్బా విద్యార్థినులు

సజావుగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పాడేరురూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మం డల కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు 8 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 585 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 545 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 40 మంది గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్‌సూపరింటెండెంట్ చీపురు రమాదేవి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ డి.దీనబంధు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఏపీఆర్, కస్తూర్బాగాంధీ విద్యార్థినులను ఆయా యాజమాన్యాలు పరీక్ష కేంద్రానికి బస్సుల్లో తీసుకువచ్చి, తిరిగి తీసుకువెళ్లారు. ఈ పరీక్ష కేంద్రాలను జేసీ డాక్టర్. ఎంజే.అభిషేక్ గౌడ ఆకస్మికంగా పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పించకుండా చూడాలని ఆదేశించారు.

కొయ్యూరు: కాకరపాడు గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. మండలంలోని గురుకుల కళాశాలకు చెందిన 110 మంది, కేజీబీవీకు చెందిన 40 మంది, ప్రభుత్వ కళాశాలకు చెందిన 29 మంది మొత్తం 170 మంది విద్యార్థులకు ఈ పరీక్ష కేంద్రం కేటాయించారు. శనివారం గురుకుల కళాశాలకు చెందిన 16 మంది, కేజీబీవీకి చెందిన ఒకరు, గవర్నమెంట్ కళాశాలకు చెందిన ఇద్దరు గైర్హాజరయ్యారు. దీంతో 160 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. స్థానిక డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి పర్యవేక్షించారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 57 మంది విద్యార్థులకు గాను మొత్తం హాజరైనట్టు కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ వి శంకరరావు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ కెవి రత్నం తెలిపారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులంతా సమయానికి ముందే పరీక్ష కేం ద్రానికి చేరుకున్నారు. 215మందికిగాను కేజీబీవీ నుంచి 39 మంది, 212మంది కళాశాల విద్యార్థులు పరీక్షలురాశారు. 14 మంది గైర్హాజయ్యారు.

గూడెంకొత్తవీధి: స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాలలో 188 మంది విద్యార్థినులకుగానూ ఇద్దరు పరీక్షలకు హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ, ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 57మంది గైర్హాజరు

చింతపల్లి: మండల కేం ద్రంలో జరిగిన పరీక్షలకు 57మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 441మందికి 398 మంది, గురుకుల కళాశాలలో 261మందికి 247మంది విద్యార్థులు హాజరయ్యారు. కాపీయింగ్ జరగకుండగా సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు.

కొత్త మోటారు చట్టంపై విస్తృత స్థాయిలో అవగాహన

చింతపల్లి, మార్చి 1: వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు తెలిపారు. శనివారం ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేసిందన్నారు. లైసెన్సులేకుండగా వాహనాలు నడిపితే రూ. 5వేలు జరిమానా విధించనున్నట్టు చెప్పారు. మైనర్ వాహనం నడిపితే రూ.500 నుంచి రూ.5వేలు, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే రూ.400 నుంచి రూ.వెయ్యి, ప్రమాదకర డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి నుంచి రూ. 2వేలు, రెండోసారి ప్రమాదకర డ్రైవింగ్ చేస్తే రూ. 10వేలు, ఆర్‌సీ లేకుంటే రూ.రెండు వేలు నుంచి రూ. 5వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉం టుందని హెచ్చరించారు. చింతపల్లి మండల కేంద్రంలోనూ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకట రమణ పాల్గొన్నారు.

పాడేరురూరల్: వాహనదారులు ప్రతీ ఒక్కరూ కొత్త మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సీఐ డి. దీనబంధు సూచించారు. శనివారం ఆయన చట్టంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.



పాడేరులో వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ దీనబంధు

మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా

కొయ్యూరు: అమలులోకి వచ్చి కొత్త వాహన చట్టం అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్‌వర్మ హెచ్చరించారు. ప్రభుత్వం నూతన వాహన చట్టాన్ని శనివారం నుంచి అమలు లోకి తెచ్చిందన్నారు. దీని ప్రకారం బైక్‌పై ఇద్దరు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ. 1000, లైసెన్సు లేకుండా నడిపితే రూ. 5 వేలు, మద్యం తాగి నడిపితే రూ. 10 వేలు, వాహనం నెంబరు ప్లేట్ సక్రమంగా లేకుంటే రూ. 2వేలు అపరాధ రుసుంతోపాటు చట్టపరమైన చర్యలుంటాయన్నారు.



పెదబయలు: మాట్లాడుతున్న ఎస్ఐ కొల్లి రమణ

బైక్‌పై ప్రయాణించే వ్యక్తికి హెల్మెట్ లేకుంటే జరిమానా

సీలేరు: రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన కొత్త వాహన చ ట్టాన్ని వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం మేరకు బైక్ నడిపేవారు, వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోతే రూ. 1000 చొప్పున, డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే రూ. 10 వేలు జరిమానా ఉంటుందన్నారు.

డుంబ్రిగుడ: మోటారు వాహన సవరణ చట్టం తూచా తప్పక పాటించాలని స్థానిక ఎస్ఐ పాపినాయుడు సూచించారు. మండలంలోని చాపరాయి జలవిహారి వద్ద జాతీయ రహదారిలో వాహనదారులకు కరపత్రాలు పంచుతూ పోలీసులు అవగాహన కల్పించారు.

పెదబయలు: స్థానిక ఎస్ఐ కొల్లి రమణ పెదబయలు - ముంచంగిపుట్టు ప్రధాన రహదారిలో రోగులపేట వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. కొత్తగా వచ్చిన నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం'

పాడేరురూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికుల వేతనాలు పెరుగుతాయని ఎదురు చూసి కార్మికులకు ప్రభుత్వం నిరాశ కలిగించిందన్నారు. బడ్జెట్‌లో కొన్ని పథకాలను నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారే తప్ప కార్మికులకు వేతనాలు ప్రస్తావనలేకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్, ఉపాధ్యక్షుడు బి.సన్నిబాబు, భగత్‌రామ్, జీనబంధు, వంకరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు చాలా తక్కువ నిధులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేటాయించిన రూ. 3.22 లక్షల బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్ అన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి గత బడ్జెట్‌తో పోల్చుకుంటే కేవలం రూ. 129 కోట్లు మాత్రమే పెంచిందన్నారు. అటవీ ఉత్పత్తులు, గిట్టుబాటు ధరలు, జీసీసీ అభివృద్ధికి కేవలం రూ. 20 లక్షలు మాత్రమే కేటాయించి జీసీసీకి నిధులు లేకుండా చేయడం అన్యాయమన్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీకి నిధులు కేటాయించక పోవడం విచారకరమన్నారు. గిరిజన విద్యకు గతంలో రూ. 948 కోట్లు కేటాయించగా ఈ సారి బడ్జెట్‌లో రూ. 945 కోట్లు మాత్రమే కేటాయించి విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు.

టెన్త్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు కృషి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగ లక్ష్మి

చింతపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని స్థానిక ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వంగసార బాలికలు, లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులోనున్న సదుపాయాలు, భోజనాలు తనిఖీ చేశారు. పది, తొమ్మిది తరగతుల విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు ఈనెల 17 నుంచి ప్రారంభంకానున్నాయన్నారు. విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులుకావడానికి గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక స్టడీ ప్ర ణాళికను అమలుపర్చిందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నివేళలా అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు అర్థం కాని పాఠ్యాంశాలను మరోసారి బోధించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై హెచ్‌ఎం, వార్డెన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వార్డెన్ కచ్చితంగా రాత్రి వసతి గృహంలో బస చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పలాసి ప్రసాదరావు, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు: హౌసింగ్ ఏఈ

చింతపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరుకు పీఎంఏవై 2.0 సర్వే చేస్తున్నట్టు హౌసింగ్ ఏఈ కె. రమణబాబు తెలిపారు. శనివారం తమ్మెంగుల గ్రా మంలో ఈ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలో పక్కా గృహాల కోసం 2,889మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుదారులు అర్హులా? కాదా? అని ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 887మందికి సర్వే పూర్తి చేశామన్నారు. లబ్ధిదారులు ఆధార్ ఈకేవైసీ చేయించుకోకపోవడం, జాబ్ కార్డు ఇనేక్టివ్‌లో ఉండడం వల్ల సర్వే వేగవంతం కావడంలేదన్నారు. పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆధార్ ఈకేవైసీ, జాబ్ కార్డు ఎక్టివేషన్ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం పీఎంఏవై 2.0తోపాటూ పీఎం జమన్‌మన్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. పీఎంఏవై పథకం ద్వారా లబ్ధిదారులకు 1.8లక్షలు, జన్‌మన్ పథకం ద్వారా రూ.2.39లక్షల నిధులు అందజేస్తున్నట్టు వివరించారు. పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, వర్కు ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలు, సమాజ పోకడలపై అవగాహన ఉండాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేజీబీవీ విద్యార్థినులకు (వివిధ వెపన్స్) తుపాకులు, వాటి పేర్లపై అవగాహన కల్పించారు. నుర్మతి పోలీస్ అవుట్ పోస్టు సీఆర్‌పీఎఫ్ ఓసీ వినాయక్ ఆధ్వర్యంలో శనివారం నుర్మతి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు రైటింగ్ సామగ్రి ఉచితంగా అందజేశారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి మండలంలో 91.81 శాతం పింఛన్ల పంపిణీ

అనంతగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీకిసచివాలయాల ఉద్యోగులు శ్రమిస్తున్నారు. శనివారం కొండలపైనున్న గ్రామాలకు వెళ్లి పింఛన్లు అందించారు. సాయంత్రం వరకు 24 పంచాయతీల్లో 5946 పింఛన్లకు గాను 5459 పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు స్థానిక ఎంపీడీవో ఏవీవీ.కుమార్ తెలిపారు. 91.81 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయడంపై సచివాలయం సిబ్బందిని ఆయన అభినందించారు..



కొండల పై నుంచి గ్రామాలకు వెళుతున్న రొంపల్లి సచివాలయ ఉద్యోగి గోపి

8 కిలో మీటర్లు ప్రయాణించి..

మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల రహదారి సౌకర్యం అంతంతమాత్రంగా ఉంటోంది. అయినా, ఈ రెండు గ్రామాల్లో ఉన్న 26 పింఛన్లు అందించేందుకు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కొర్రా గోపి.. రొంపల్లి నుంచి గుర్ల మీదుగా వాణిజ వరకు స్కూటీపై వెళ్లి, అక్కడ నుంచి 8 కిలో మీటర్లు కొండలు, గుట్టలను మీదుగా కాలినడకన చేరుకుని, పింఛన్ల అందజేశారు.

సంతలో బుడియాలు సందడి



వివిధ వేషధారణలో ర్యాలీగా వెళ్తున్న బుడియాలు

ముంచంగిపుట్టు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట గంగమ్మ తల్లి ఉత్సవాలు సందర్భంగా బుడియా మాలధారణ చేసిన భక్తులు శనివారం జరిగిన స్థానిక వారపు సంతలో సందడి చేశారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రచార ర్యాలీ నిర్వహించారు. వివిధ వేషధారణలతో నృత్యాలు వేస్తూ సందడి చేశారు. అలాగే రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వి.రమేశ్, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బలక్ష్మి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు శంకరరావు, నీలకంఠం, బలరాం, తిరుపతిరావు, రుక్మంధర్, గాసీరావు, దామోదరం, సదానందం పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించండి

డుంబ్రిగుడ,మార్చి1(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లికార్జునరావు సూచించారు.అడపవలస గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన మెనుతోపాటు చిన్నారుల అభ్యసన ప్రగతి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులు చదువుపై మక్కువ చూపించేలా జాగ్రత్త వహించాలన్నారు. ఆటలు, పాటలతోపాటువారిలోశారీరకంగా ఎదుగుదల ఉండేలా శ్రద్ధ వహించాలని కోరారు.

కానరాని పర్యాటకులు

అరకులోయ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో సందర్శకులు పెద్దగా కానరాలేదు. ప్రస్తుతం రెండు తెలుగురాష్ట్రాల్లో పరీక్షలు ప్రారంభం కావడంతో పర్యాటకులు అనుకున్నంత స్థాయిలో రావడంలేదు. శనివారం వీకెండ్ ఐనప్పటికీ అన్ని పర్యాటక కేంద్రాలు సందర్శకులురాక బోసిపోయి కనిపించాయి.

క్రీడలకు ప్రోత్సాహం: ఎమ్మెల్యే

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఫెండ్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ క్రీడల పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చక్కని క్రీడాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ పోటీలను రెండు రోజుల పాటు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు జొన్నాడ శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ, ఎస్.త్రినాథ్ తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వొద్దు

చీడికాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సొంత జిరాయితీ పొలంలోనైనా అనుమతి లేకుండా మట్టి తవ్వకూడదని డిప్యూటీ తహసీల్దార్ వీవీఎస్.సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారంతురువోలు గ్రామంలో ఎక్స్‌కవేటర్‌తో పెద్ద చెరువు పక్కన మట్టి తీసి తరలిస్తున్న విషయం తెలుసుకుని వీఆర్వోపై మండిపడ్డారు. సొంత భూమిలోనైనా మట్టి తవ్వాలంటే అనుమతులు ఉండాలని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

దేవరాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం రైతులతో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం వల్ల ఆర్థిక భారం పడుతుందని, ఆ పంటల ఆహారం అనారోగ్యకరమని చెప్పారు. సహజ వనరులు వినియోగించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. సదస్సులో ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీఎం ప్రభాకరు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలోని వెలుగు కార్యాయంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేసే పద్ధతుల ఏవో ఎం.వాసుదేవరావు రైతులకు వివరించారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి వందశాతం ప్రకృతి వ్యవసాయం ఏసి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అప్పలనర్సమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గిరి మహిళలకు చీరల పంపిణీ

మాడుగుల రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేట గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పెదబయలు మండలం బెళ్లపురాయి, గూడెం గ్రామాల్లోని గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ గ్రామాల్లో రైతులకు పసుపు విత్తనాలను అందిస్తామని ఈ సందర్భంగా సంఘం చైర్మన్ వడ్డి రాజ్‌కుమార్, డైరెక్టర్ నీలాపు రాము చెప్పారు.

రోడ్లు ధ్వంసం.. రాకపోకలకు నరకం!



ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు రోడ్డు తవ్వుతున్న దృశ్యం

పట్టణంలో రహదారులన్నీ అధ్వానం
తాగునీరు లీకేజీతో మరమ్మతులకు తవ్వకాలు
నీటి సరఫరా పైపుల మార్పుతో అస్తవ్యస్తం



పోలీసు స్టేషన్ ఎదురుగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న బీటీ రోడ్డు

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):
పట్టణంలో రహ'దారులు' ధ్వంసమవుతున్నాయి. మంచినీటి సరఫరా పైపులు తరచూ లీకేజీ ఏర్పడుతుండడంతో బాగున్న రోడ్లు పాడవుతున్నాయి. శనివారం ఉదయం ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు నీరు లీకేజీ కావడంతో మరమ్మతులు చేయడానికి కొత్తగా వేసిన రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు. పోలీస్ స్టేషన్ ముందు పాత సంతబయలుకు వెళ్లే రోడ్డును కూడా తవ్వి పైపులు బాగు చేశారు. పాల్‌ఘాట్ సెంటర్‌లో వెంకునాయుడపేటకి రోడ్డులో కల్వర్టు దగ్గర మంచి నీటి సరఫరా పైపులు రంధ్రాలు పడి నీరు పోతుండడంతో నెల రోజుల క్రితం మునిసిపాలిటీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రంధ్రం మట్టితో కప్పినప్పటికీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల్‌ఘాట్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రెండు నెలల క్రితం కొత్తగా వేసి రోడ్డు ఎక్స్‌కవేటర్‌తో తవ్వి పైపులు బాగు చేశారు. ఎన్నికలకు ముందే అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణం చేశారు. ఇప్పుడు నీటి సరఫరా పైపులు మరమ్మతులు చేయడానికి రోడ్లు తవ్వేస్తున్నారు. ప్రతీ రోజు ఎక్కడో ఒకచోట ప్రధాన పైపులైన్ నుంచి నీరు లీకేజీ కావడం, మరమ్మతులు చేయడానికి రోడ్లు తవ్వేయడం పరిపాటిగా మారిపోయింది. దీని వలన బాగున్న రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. 2009లో నర్సీపట్నం పంచాయతీగా ఉన్నప్పుడు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పీవీసీ పైపులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. 50 ఏళ్ల క్రితం అండర్ గ్రౌండ్‌లో వేసిన సిమెంటు పైపులకు రంధ్రాలు పడి భారీగా నీరు లీకేజీ కావడం జరుగుతున్నది.

సమగ్ర మంచినీటి పథకంపై ఆశలు

మునిసిపాలిటీకి సమగ్ర మంచి నీటి పథకం నిర్మాణం జరిగే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు భావించారు. ఈ పథకం పూర్తి చేస్తే పాత పైపులైన్ స్థానంలో కొత్త లైన్ వేసి నిరంతరం శుద్ధి చేసిన తాగునీరు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏలేరు నీటి లభ్యత ఆధారంగా రూ.166 కోట్లతో పథకం పనులు ప్రారంభించారు. పైపులైన్లు వేయడానికి కాంట్రాక్టర్ సీసీ రోడ్లు తవ్వేసి వదిలేశారు. నీటి సరఫరా పైపులు అమర్చలేదు. కాంట్రాక్టర్‌కి బిల్లులు బకాయి ఉండడంతో నీటి పథకం మధ్యలో వదిలేశారు. వార్డుల్లో సీసీ రోడ్లు ఎక్కడకక్కడ రంధ్రాలు పడిపోయాయి. మెయిన్ రోడ్డు పరిస్థితి చూస్తే పైపు లైన్ లీకేజీలు మరమ్మతులతో పాడవుతున్నది. కూటమి ప్రభుత్వంలో సమగ్ర తాగునీటి పథకం పనులు తిరిగి ప్రారంభమవుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహణ
మొదటి రోజు పలువురు విద్యార్థుల డుమ్మా
కొన్ని పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్ బృందాల తనిఖీలు

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం సజావుగా ప్రారంభమయ్యాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా జరిగాయి. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని కేంద్రాల్లో స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.





నర్సీపట్నంలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు... దేవరాపల్లి: బస్సులో వస్తున్న తెనుగుపూడి గురుకుల విద్యార్థులు

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలోని ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. విద్యార్థులు ఎనిమిది గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికాలు తీసుకు వెళ్లనివ్వలేదు. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ బాలురు, బాలికల కళాశాలు, అంబేడ్కర్ గురుకుం బాలికలు, ఏబీఎం, శ్రీప్రగతి, మాకవరపాలెం, కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

మాడుగులలో 31 మంది గైర్హాజరు

మాడుగుల: మండలంలో ఇంటర్ మొదటి సంవత్సరం రీక్షకు 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాడుగుల పరీక్షా కేంద్రంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాయత్రి, సురవరం కేజీబీవీ కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 469 మంది వచ్చారని పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ నీలిమ తెలిపారు.

కృష్ణాదేవిపేటలో 11 మంది...

కృష్ణాదేవిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో గొలుగొండ కేజీబీవీ, ఎల్ఎన్ఎం నాయుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన 251 మందికి పరీక్ష రాయాల్సి ఉండగా, 240 మంది వచ్చారని చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.గంగరాజు తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ ఎల్.రేవతమ్మ, కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మాకవరపాలెంలో పది మంది...

మాకవరపాలెం: మండల కేంద్రంలో ఇంటర్ పరీక్ష కేంద్రంలో పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 238 మంది పరీక్షకు హాజరుకావాలసి ఉండగా, 228 మంది పరీక్ష రాశారని ప్రభుత్వ జీజే కళాశాల ప్రిన్సిపాల్ భారతశ్రీ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ దామోదర్‌నాయుడు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రావికమతంలో ముగ్గురు...

రావికమతం: కొత్తకోట జూనియర్ కళాశాల కేంద్రంలో మొదటి రోజు ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. మొత్తం 227 మందికి గాను 224 మంది పరీక్షలు రాశారని డీవో రామకోటి తెలిపారు. ఎనిమిది గదుల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్టు చెప్పారు.

రోలుగుంటలో ఐదుగురు...

రోలుగుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో తొలి రోజు పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 207 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 202 మంది వచ్చారని ప్రిన్సిపాల్ అప్పలరాజు తెలిపారు.

దేవరాపల్లిలో 14 మంది...

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో 257 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 243 మంది హాజరయ్యారు. తొమ్మిది గదుల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. తెనుగుపూడి గురుకుల విద్యార్థులు బస్సులో పరీక్షకు వచ్చారు. వికలాంగ విద్యార్థి తన తండ్రి సాయంతో పరీక్షకు హాజరయ్యారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీవీ.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం బాలురు గురుకుల విద్యాలయం, అచ్యుతాపురంలోని బాలిక గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, 6, 7, 8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలు, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న అనకాపల్లిలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన చెప్పారు.

సారా విక్రయిస్తే చర్యలు

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాటుసారా రవాణా, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా రోలుగుంట మండలం కుంతలం గ్రామంలో నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తయారు, రవాణాకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ కిరణ్‌కుమార్, హెచ్‌సీ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రతిభ అవార్డుకు మాకవరపాలెం ఎంపిక



మాకవరపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ప్రతిభా అవార్డుకు మాకవరపాలెం లైన్‌మన్ బి.మాణిక్యాలరావు ఎంపికైనట్టు ఈపీడీసీఎల్ ఏఈ బాలకృష్ణ తెలిపారు. ఈ నెల 4వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకుంటారని చెప్పారు. ఈ మేరకు మాణిక్యాలరావును ఏఈతో పాటు సిబ్బంది అభినందించారు.

ఉత్తరాంధ్ర స్థాయి పాడి పశువుల పాల పోటీల్లో పాల్గొనాలి

రావికమతం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా తోటపాలెంలో ఈ నెల 14న జరిగే ఉత్తరాంధ్ర స్థాయి పాడి పశువుల పాల పోటీల్లో పాల్గొనాలని పాడేరు డివిజన్ పశు సంవర్థక శాఖ డీడీ సిహెచ్.నరసింహులు కోరారు. రావికమతం, గొంప, తోటకూరపాలెం గ్రామాలలో శనివారం ఆయన పర్యటించి పాడి రైతులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో అధిగ పాల దిగుబడి సాధిస్తున్న రైతులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. రవాణా, దాణా, పశుగ్రాసం, తాగునీరు వంటి సౌకర్యం అక్కడ కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావికమతం పశు సంవర్థక శాఖ ఏడీ టి.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో జాతీయ ధర్మ పరిషత్ చైతన్య యాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న పరిషత్ ప్రతినిధులు

నాతవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ధర్మ పరిషత్ చైతన్య యాత్ర నిర్వహించారు. ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ చరణానంద భారతీస్వామి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు నుంచి పురవీధుల మీదుగా యాత్ర సాగింది. అనంతరం ఫారెస్టు మైదానంలో సనాతన ధర్మసభ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర, ధర్మ పరిషత్ ప్రతినిధులు ఎన్.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, యర్రా కాశీ, బీజేపీ నేత జి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి గూగుల్ మీట్ ద్వారా ప్రారంభించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగం అధ్యాపకులు సుధీర్, రత్నభారతి, రఫియుద్దీన్, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, బి.పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గొలుగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మండల ప్రత్యేకాధికారి మూర్తి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజీతో కలిసి శనివారం భూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సీహెచ్.నాగాపురం పంచాయతీ శివారు పల్లాఊరులో జిరాయితీ భూమికి సంబంధించి ఇరువర్గాలతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మండలంలో ప్రతీ శనివారం పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై ఇరు వర్గాలతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపడుతున్నామని శనివారం తెలిపారు.

నైపుణ్య విలువలు అలవర్చుకోవాలి

నాతవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్య విలువలు అలవర్చుకోవాలని సంస్కృతి పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి పేర్కొన్నారు. శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. అనంతరం పలువురు విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గొయ్యిలకు ప్రాధాన్యం

చీడికాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపునకు, పండ్ల తోటలు వేసిన పరిసరాల్లో ఇంకుడు గొయ్యిలు, కుంటల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి ఆదేశించారు. జి.కొత్తపల్లి గ్రామంలో ఇంకుడు గొయ్యిలను ఎంపీడీవో హేమసుందర్రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ నిర్మాణం చాలా బాగుందని, ఇదే విధంగా అన్ని గ్రామాల్లో నిర్మాణాలు జరిగేలా చూడాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మండలంలో 245 ఇంకుడు గొయ్యిలు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఉపాధి పథకం ఏపీవో అల్లు గంగునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ ఎక్స్‌పో



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు చూస్తున్న తల్లిదండ్రులు

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య మహతి స్కూల్‌లో శనివారం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించిన విద్యార్థులు నీటి సంరక్షణ, అగ్ని ప్రమాదసూచిక, పంటలను కాపాడుకునే విధానం, సౌరకుటుంబం, నీటి శుద్ధీకరణ, రోబో ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కేవీవీ.సూర్యనారాయణరాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొట్లాట ఘటనలో ఒకరికి గాయాలు

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి ప్రాంగణంలో భూ వివాదం విషయమై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు శనివారం ఘర్షణకు దిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చీడికాడ మండలం బయలపూడి అగ్రహారానికి చెందిన గోకాడ సూర్యనారాయణ, గోకాడ కాసులకు మధ్య పొలంలో దారి విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో గోకాడ కాసు శనివారం ఉదయం పొలంలో వెళుతుండగా, గోకాడ సూర్యనారాయణ కాసుతో వాదనకు దిగడంతో సూర్యనారాయణ, కాసును కొట్టాడు, ఈ సమాచారం తెలిసిన కాసు కుమారులు తమ తండ్రిపై దాడి చేసిన సూర్యనారాయణకు దేహశుద్ధి చేసి, అక్కడ నుంచి గాయపడిన తమ తండ్రిని చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. దీంతో సూర్యనారాయణ మరోసారి కాసు చికిత్స పొందుతున్న స్థానిక ఆసుపత్రికి వచ్చి మరోసారి కాసు కుటుంబీకులతో ఘర్షణకు దిగడంతో, ఇరుపక్షాల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా కాసు కుటుంబీకులు సూర్యనారాయణను తీవ్రంగా కొట్టారు. గాయపడిన సూర్యనారాయణను అనకాపల్లి ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరుపక్షాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు స్థానిక సీఐ బి.అప్పలరాజు తెలిపారు.

పాఠశాల కమిటీ చైర్మన్ భర్తపై కత్తితో దాడి



గాయపడిన వెంకునాయుడు

దేవరాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ అల్లం కాసులమ్మ భర్త వెంకునాయుడుపై అదే గ్రామానికి చెందిన కాటిపాము ఆనంద్ శనివారం కత్తితో దాడి చేశాడు. ఈదాడిలో వెంకునాయుడు తలపై తీవ్ర గాయం కావడంతో దేవరాపల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

తెనుగుపూడి పాఠశాలలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవం పార్టీకి పిల్లల నుంచి ఉపాధ్యాయులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారంటూ ఎంఈవోకి ఫిర్యాదుచేశారు. ఈ విషయమై ఆనంద్‌ను అడగాడా నికి వెళ్లిన తనను అతని తండ్రి పట్టుకోగా ఆనంద్ కత్తితో దాడి చేశాడని వెంకునాయుడు విలేకరులకు తెలిపారు. కాగా ఇదేవిషయం ఆనంద్ వద్ద ప్రస్తావించగా వార్షికోత్సవానికి డబ్బులు వసూలు చేశారని ఎంఈఓకు ఫిర్యాదు చేశారనే అక్కసుతో వెంకునాయుడు రెండుసార్లు కత్తితో కొట్టాడన్నారు. తాను కత్తి పట్టుకొని జీడితోటలో తుప్పలు నరకడానికి వెళుతున్న సమయంలో ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో కత్తిపిడి అతని తలపై తగిలిందని తప్పదాడి చేయలేదన్నారు. ఈ విషయమై ఎస్ఐ టి.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. ఫిర్యాదు అందలేదన్నారు.

ఆధారం లేకుండా పాస్ పుస్తకం ఎలా ఇస్తాం?

» మండల ప్రత్యేకాధికారి మూర్తి » స్పందన ఫిర్యాదుపై విచారణ



విచారణ చేపడుతున్న ప్రత్యేకాధికారి మూర్తి, మండల స్థాయి అధికారులు

చీడికాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'మీ భూమి తాలూకా ఆధారాలు లేకుండా మీ పేరున పాస్ పుస్తకం ఎలా ఇస్తాం' అని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి ప్రశ్నించారు. తునివలస గ్రామానికి చెందిన బయ్యవరపు నాగమణి సర్వే నంబరు 82/14లో 97 సెంట్ల భూమిని తమ తాతల సమయంలో కులవృత్తి చేస్తుండగా ఓ రైతు తమకు ఇచ్చారని, దీనిలో ప్రస్తుతం 27 సెంట్లు తనకు వాటాగా ఉందని, ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని 2020 నుంచి 2024 వరకు ఆరు పర్యాయాలు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై రికార్డు పరంగా అధికారిక పత్రాలు లేకపోయినా 2020 సెప్టెంబరు 18న సర్వే సర్టిఫికెట్ తన పేరున ఇచ్చారని, దీని ప్రకారం పాస్‌పుస్తకం ఇవ్వాలని నాగమణి కోరారు. దీనిపై శనివారం మండల స్థాయి అధికారుల సమక్షంలో ఎంపీడీవో కార్యాలయంలో విచారించగా ఆమె ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో 'నీ పేరున పాస్‌పుస్తకం ఇవ్వలేం' అని ప్రత్యేకాధికారి స్పష్టం చేశారు. ఏమైనా ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లాలని సూచించారు. ఈ విచారణలో ఎంపీడీవో హేమసుందర్రావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కె.రామారావు, వీఆర్వో మూర్తి పాల్గొన్నారు.

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పిస్టల్ గురించి వివరిస్తున్న పోలీసులు

నర్సీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా సెక్యూరిటీ, బాంబ్ డిటక్షన్, డాగ్ స్క్వాడ్ విభాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి వైద్యులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పిస్టల్స్, ఏకే 47 తదితర ఆయుధాలు ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎండలతో తస్మాత్ జాగ్రత్త

» మండల ప్రత్యేకాధికారి కె.వసంతరావు

రావికమతం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఎండల తీవ్రతపై జాగ్రత్తగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి కె.వసంతరావు సూచించారు. మండలంలోని గుడివాడ చెరువులో ఉపాధి పథకంలో చేపట్టిన పూడిక తీత పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడి రోజు కూలి ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం భూమిలో తేమ ఉన్నందున నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేసి రోజు రూ.300 వేతన పొందాలని సూచించారు. పని ప్రదేశంలో ఎప్పుడూ మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం గుడివాడ, మట్టవానిపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ప్రక్రియను తనిఖీ చేశారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నది? లేనిది? తెలుసుకుని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామస్వామి, ఈవోపీఆర్డీ భానోజీరావు పాల్గొన్నారు.

చోడవరంలో హీరోయిన్ అంజలి సందడి



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న అంజలి

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరోయిన్ అంజలి శనివారం రాత్రి పట్టణంలో సందడి చేశారు. స్థానిక స్వయంభూ గౌరీశ్వర శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొని తన మాటలతో ఆనందింపచేశారు. తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో స్వయంభూ గౌరీశ్వరుడిని దర్శించుకోవడం, శివరాత్రి ఉత్సవాల్లో పాలుపంచుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అంజలికి టీడీపీ నేత గూనూరు మల్లునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.మత్స్యరాజు తదితరులు ఘనంగా సత్కరించారు. అలాగే జబర్దస్త్ కళాకారులు చేసిన స్కిట్‌లు అందరినీ అలరించాయి. రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా కళాకారులు, జబర్దస్త్ కళాకారులు శాంతి స్వరూప్‌తో పాటు దర్శకులు వశిష్ట తదితరులను సన్మానించారు.

మోదకొండమ్మను దర్శించుకున్న సినీ కళాకారులు



అమ్మవారి ఆలయానికి వచ్చిన కళాకారులు

మాడుగుల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మను టీవీ సీరియల్ నటి, జబర్దస్త్ కమెడియన్లు శనివారం దర్శించుకున్నారు. మాడుగుల వచ్చిన గీతా ఎల్ఎల్‌బీ టీవీ సీరియల్ నటి రిజ్వాన, జబర్దస్ కమెడియన్ శాంతికుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో, గ్రామ ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. వారితో అభిమానులు సెల్ఫీలు దిగారు. ఆర్య, వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ మధు, ఉపాధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, అనకాపల్లి లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బినా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలి

కె.కోటపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలని సీడీపీవో డి.మంగతాయారు సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సప్తాహం నిర్వహించారు. అలాగే జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అలాగే కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వెంకటపద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుశీల, కళ్యాణి, ఎం.రాములమ్మ, జి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆహారం.. ఆరోగ్యం



ప్రజల జీవన విధానంలో మార్పులు

- వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్ వినియోగం
- రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటితో చేసిన ఆహారానికి ప్రాధాన్యం
- సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, పంటలకు పెరుగుతున్న డిమాండ్
- షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారం తీసుకోవడం మంచిదంటున్న వైద్యులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవనశైలి, ఆహారపు అలవాట్లపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అందుకే ప్రస్తుతం చాలా మంది అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకూ చిరుధాన్యాలతో చేసిన వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఉదయాన్నే పూరీ, వడ వంటివి తీసుకోవడం వల్ల బద్ధకంగా ఉంటుంది. చిన్న వయసులోనే ఊబకాయం వచ్చేందుకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది మిల్లెట్ డైట్‌కు మళ్లుతున్నారు. ఉదయాన్నే రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలతో చేసిన ఇడ్లీ, దోసెలు, కిచిడీ, ఉప్మా వంటివి తింటున్నారు.

భోజనంలో మార్పులు

గ్లైసెమిక్ ఇండెక్స్ అధికంగా ఉండడంతో చాలామంది వైట్ రైస్‌కు దూరంగా ఉంటున్నారు. వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్, ఓట్స్, కొర్రలు, సామలు, అరికలతో తయారుచేసిన ఆహార పదార్థాలకు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే తెల్లని రైస్ పండిస్తున్నారు. తెల్లని రైస్‌కు అలవాటు పడినవాళ్ల వాటిని తెప్పించుకుని తింటున్నారు.

సేంద్రీయ పంటల వైపు మొగ్గు..

మరోవైపు రసాయనాలు వినియోగించకుండా పండించిన కూరగాయలు, పంటల వైపు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటి ధర కాస్త అధికంగా ఉన్నప్పటికీ వెనక్కి తగ్గడం లేదు. ఎంతో మంది మేడపైనే తమకు కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలను సేంద్రీయ పద్ధతుల్లో పండించుకుంటున్నారు. మరోవైపు మార్కెట్‌లో లభించే ఆయిల్ కంటే గానుగ నూనెలు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. దేశీవాళీ ఆవు పాలకు, నెయ్యికి కూడా డిమాండ్ పెరుగుతోంది.

ఆరోగ్యానికి మేలు

చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి వాటితో చేసిన ఆహార పదార్థాలు బీపీ, థైరాయిడ్, ఊబకాయం, కంటి సమస్యలు, పీసీవోడీ, అండాశయం ఇబ్బందులు, డయాబెటిస్, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడే వారికి ఎంతగానో మేలు చేస్తాయని చెబుతున్నారు. షుగర్, ఊబకాయం వంటి సమస్యలకు గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడమే కారణంగా వైద్యులు చెబుతున్నారు. తృణధాన్యాల్లో జీఐ తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ వంటివి దరిచేరవని నిపుణులు చెబుతున్నారు. అలాగే, తృణ ధాన్యాల్లో అధికంగా ఉండే ప్రొటీన్లు కండరాల సామర్థ్యానికి దోహదం చేస్తాయి.

గ్లైసెమిక్ ఇండెక్స్ అంటే ?

గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) అనేది ఆహారంలో ఉండే వివిధ రకాల కార్బోహైడ్రేట్లకు శరీరం ఎంత త్వరగా స్పందిస్తుందో కొలిచేందుకు సహాయపడే సాధనంగా చెప్పవచ్చు. జీఐ 55లోపు ఉంటే తక్కువగా, 55 నుంచి 69 మధ్య ఉంటే మధ్యస్థంగా, 70 దాటి ఉంటే ఎక్కువగా ఉన్నట్టు చెబుతారు. జీఐ అధికంగా ఉండే ఆహార పదార్థాలు విషయానికి వస్తే.. తెల్ల బియ్యం, పుచ్చకాయ, చిలగడదుంప, కాల్చిన బంగాళాదుంప, తెల్ల రొట్టె, జెల్లీ బీన్స్ వంటి వాటిల్లో 70కు పైబడి ఉంటుంది. ఎండు ద్రాక్ష, పైనాపిల్, మొక్కజొన్న, టేబుల్ షుగర్, బ్రౌన్ రైస్ వంటి వాటిల్లో 56 నుంచి 69 మధ్య ఉంటుంది తక్కువ జీఐ ఉండే ఆహార పదార్థాల్లో కాయధాన్యాలు, సహజ పెరుగు, కాల్చిన బీన్స్, స్కిమ్డ్ మిల్క్, క్యారెట్, తృణ ధాన్యాలతో చేసిన రొట్టెలు ఉంటాయి.

తక్కువ జీఐ ఉండే పండ్లు: యాపిల్స్, ద్రాక్ష, స్ట్రాబెర్రీస్, చెర్రీస్, కమలాలు

ఆహారం: ఓట్స్, ఆలివ్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్, క్వినోవా, పాలు, బాదం, వాల్ నట్స్, కాయ ధాన్యాలు,

కాయగూరలు: కారెట్, బ్రకోలీ, టమాటా, కాలీఫ్లవర్

తక్కువ జీఐ ఉన్నవి తీసుకుంటే బ్లడ్ షుగర్స్, కొలెస్ట్రాల్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. ఊబకాయం వచ్చే అవకాశం ఉండదు. గుండె జబ్బులకూ దూరంగా ఉండవచ్చు.

బ్యాలెన్స్‌డ్ డైట్ అత్యంత కీలకం



మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని కూడా పరిధి మేరకు తీసుకోవాలి. ఏవి తీసుకున్నా బ్యాలెన్స్ డైట్ అత్యంత కీలకం. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి. షుగర్, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మిల్లెట్స్‌తో చేసిన ఆహారం మంచిది. వీటి వినియోగం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

- **డాక్టర్ ఆర్.రేఖ,** పోషకాహార నిపుణులు, ఏయూ

క్రైం... crime news

మేడ పైనుంచి పడి యువకుడి మృతి



మృతి చెందిన మరిసా కృష్ణ (ఫైల్)

కృష్ణాదేవిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలుజారి మేడపై నుంచి పడిన యువకుడు మృతి చెందినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం గ్రామానికి చెందిన మరిశా కృష్ణ(30) శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మూత్రవిసర్జన కోసం లేచి మేడపై నుంచి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి మేడపై నుంచి సీసీరోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఆ ఇంటి మేడపై పిట్టగోడ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. మృతుడు తల్లి మరిశా వరహాలమ్మ ఫిర్యాదుతో సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

అపిటోరియా ఫార్మాలో ప్రమాదం

- ఒకరికి అస్వస్థత

పరవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ -6లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికుడు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రొడెక్షన్ బ్లాక్‌లో ఎజెటిమైన్ (ఔషధ మధ్యస్థ పదార్థం) ఫిల్ట్రైజేషన్ తరువాత దాన్ని అన్‌లోడ్ చేసే పనిని కాంట్రాక్టర్ కార్మికుడు కె.అప్పలనాయుడు చేస్తున్నాడు. అన్‌లోడ్ అనంతరం పక్కనే ఉన్న డైక్లోరైడ్ (ఎండీసీ)తో ఫిల్టర్ బ్యాగ్‌ను కడిగి ఆర బెట్టడానికి సిద్ధమవుతున్న క్రమంలో ఎండీసీ ప్రభావంతో అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వెంటనే తోటి కార్మికులు అప్పలనాయుడును అగనంపూడి కమ్యూనిటీహెల్త్ సెంటర్‌కు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా అస్వస్థతకు గురైన అప్పలనాయుడు గత ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాహితీ ఫార్మా' ప్రమాద కారణాలపై స్పష్టత శూన్యం

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయని పిటిషన్ వేసింది. ఇదిలావుండగా ప్రమాదంపై జిల్లా అధికారులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బయటపెట్టలేదు. విశాఖ జిల్లాలోని మానవ హక్కుల వేదిక పదే పదే సమాచార హక్కు చట్టం కింద కోరడంతో పది పేజీల నివేదికను ఫిబ్రవరి 28న పోస్టులో పంపించారని శాస్త్రవేత బాబూరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. పది పేజీల నివేదిక రాయడానికి కమిటీ 20 నెలల సమయం తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ నివేదికలో కూడా ప్రమాదం జరగడానికి కారణాలు వెల్లడించలేదని, ఎందుకు జరిగింది?, ఎలా జరిగిందో?...విశ్లేషణ లేదని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదం జరగకుండా ఏమి చేయాలో కూడా సూచనలు చేయలేదని విచారం వ్యక్తంచేశారు. ఆరు టన్నుల బరువు కలిగిన ట్యాంకు 70 మీటర్ల దూరం వెళ్లి పడిందని, అంత శక్తి మంటల వల్ల రాదని, విస్ఫోటనంతో సాధ్యమని, అది ఎలా జరిగిందో కమిటీ వెల్లడించలేదని ఆరోపించారు. ఎన్‌జీటీలో కేసు నడుస్తున్నప్పుడు ఈ నివేదిక బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారని, కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యాలకే కాకుండా అధికారులకు కూడా బాధ్యత కరువైందని, అటువంటి కమిటీల వల్ల ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చోడవరం-గవరవరం రోడ్డుకు మరమ్మతులు



చోడవరం-గవరవరం రోడ్డులో గుంతలను పూడుస్తున్న దృశ్యం

చోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత రద్దీగా ఉండే చోడవరం-గవరవరం రోడ్డులో గుంతల కష్టాలకు మోక్షం కలిగింది. గుంతలమయంగా మారిన ఈ రోడ్డులో వాటిని ఆర్అండ్‌బీ అధికారులు కప్పుతున్నారు. గుంతలు పూడ్చి పైన తారుపూత వేస్తున్నారు. చాలాకాలంగా రహదారి గుంతలు పడి దారుణంగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారిపై గుంతలను పూడుస్తుండడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న అతి పెద్ద ట్రాలర్

నక్కపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఒడిశా స్టీల్ ప్లాంట్‌కు అతి పెద్ద ట్రాలర్ వెళుతూ శనివారం నక్కపల్లి హైవేపై సందడి చేసింది. సుమారు 100 చక్రాలతో వున్న ట్రాలర్‌ను అందరూ ఆసక్తిగా తిలకించారు.



చెన్నై నుంచి ఒడిశాకు వెళుతున్న అతి పెద్ద ట్రాలర్

అధిస్థాన్ ఉద్యోగుల వేతనాల పెంపు

- ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు
- ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమని భారత భాగస్వామి దొరస్వామి వెల్లడి



జీతాల పెంపు ప్రకటన అనంతరం ఉద్యోగులతో దొరస్వామి

అచ్యుతాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అధిస్థాన్ ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నట్టు యాజమాన్యం శనివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి రెండు షిఫ్టుల్లో వచ్చిన ఉద్యోగులతో భారత భాగస్వామి దొరస్వామి వేర్వేరుగా చర్చలు జరిపి 13 వేల మందికి అనుభవం ఆధారంగా వేతనాలు పెంచుతున్నామని ప్రకటించారు. సంస్థలో 15 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్నవారికి రూ.1500లు, 10 నుంచి 14 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి రూ.1000, ఎనిమిది నుంచి తొమ్మిది సంవత్సరాల అనుభవం ఉన్న వారికి రూ.850, ఐదు నుంచి ఏడు సంవత్సరాల అనుభవం ఉన్నవారికి రూ.800, రెండు నుంచి నాలుగు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి రూ.750 చొప్పున పెంచారు. అంతేకాక సంస్థ సీటీసీ రూపంలో ఒక్కో ఉద్యోగికి రూ.250లు చెల్లించనుంది. కాగా వేతనాల పెంపు కారణంగా సంస్థపై రూ.18 కోట్ల అదనపు భారం పడుతుందని భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. ఇప్పటికే సంస్థలో నాలుగు యూనిట్లు నష్టాల్లో నడుస్తున్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమం, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడేది లేదన్నారు. అంతర్జాతీయంగా వస్త్రపరిశ్రమ రంగంలో మార్పులు, ఒడిదుడుకులు మూలంగా సంస్థలో యూనిట్లు క్లిష్టతరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయన్నారు. ఇన్ని సమస్యలు నెలకొని ఉన్నా ఉద్యోగులకు వేతనాలు పెంచినట్టు ఆయన చెప్పారు. వేతనాల పెంపు ప్రకటనతో ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు, శ్రీలంక నుంచి వచ్చిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట

... 5వ పేజీ తరువాయి

పండించడం ద్వారా సుస్థిర ఆదాయం వచ్చేలా కార్యక్రమాలు రూపొందించి ఆ షెడ్యూల్‌ను రైతులు పాటించేలా వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది కూడా పర్యవేక్షించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా లభ్యమయ్యే దినుసులను ఉపయోగించి వాటితో కషాయాలు, జీవ ఘన ఎరువులను తయారు చేసే విధానాలను కూడా రైతులకు చూపించనున్నారు. రైతులంతా ఈ వ్యవసాయం చేసేలా వారిని చైతన్యవంతులను చేయడం, ఆపై ఇతర గ్రామాల్లో కూడా ఇదే విధానం అనుసరించేలా అధికారులు ఆలోచన చేస్తున్నారు. వాస్తవానికి రైతులు సేంద్రీయ సాగు చేసే లక్ష్యంతో ఈ ప్రకృతి వ్యవసాయ విభాగం పదేళ్ల క్రితమే ఏర్పాటైంది. వ్యవసాయశాఖకు అనుబంధంగా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయిలో కో- ఆర్డినేటర్లు, గ్రామస్థాయిలో గ్రామ రిసోర్సు పర్సన్ల ద్వారా ఈ ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యక్రమాలు నిర్వహించే వారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నంత వరకూ ఈ ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యక్రమాలు చక్కగానే అమలయ్యేవి. అయితే 2019 తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఈ కార్యక్రమంపై ప్రభుత్వం ఆసక్తి చూపించకపోవడంతో ఈ ప్రకృతి వ్యవసాయం పూర్తిగా మిథ్యగా మారి కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం, కూటమి ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయాలన్న పట్టుదలగా ఉండడంతో, ప్రస్తుతం నూరుశాతం ప్రకృతి వ్యవసాయం అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే ప్రకృతి వ్యవసాయాన్ని పాటించేలా పూర్తిస్థాయిలో వ్యవసాయ విభాగాన్ని ఉపయోగించుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ప్రకృతి సాగు పెంచే దిశగా అధికారుల కార్యాచరణ విజయవంతం అయితే గ్రామాల్లో సేంద్రీయ ఉత్పత్తులు మరింత విరివిగా అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూముల సారం కోల్పోవడంతో పాటు ప్రజలు రైతుల ఆరోగ్యాలు దెబ్బతినడం మినహా, మరెలాంటి ఉపయోగం లేనందున, తిరిగి సేంద్రీయ పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు.

ఏయూను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సంస్కరణలు చేపట్టడం ద్వారా వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేస్తానని పేర్కొన్నారు. వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిలపాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ ప్రగతికి కృషిచేస్తానని, ఇందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్-2047కు వర్సిటీ కూడా తన వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు. ఎంతోమంది మహనీయుల స్ఫూర్తి, కృషి ఫలితంగా వర్సిటీ ఉన్నత స్థానంలో నిలిచిందని, దీనిని ముందుకు తీసుకువెళతామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా కరిక్యులమ్‌కు రూప కల్పన చేస్తామన్నారు. కేంద్రీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ వనరులు, నిధులు పెంపొందించుకునేందుకు కృషిచేస్తామని వివరించారు. ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ఉన్న వనరులతోనే అత్యుత్తమ ఫలితాలను అందించేందుకు కృషిచేస్తామని స్పష్టంచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే దిశగా నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్న సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీకి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా లీడర్ షిప్ అకాడమీలు, క్లబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇండస్ట్రీ, అకాడమీ మధ్య పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు అనుగుణంగా పరిశ్రమలకు చెందిన నిపుణుల సేవలను వినియోగించుకుంటామన్నారు. వర్సిటీలో ఫ్యాకల్టీ సమస్య ప్రధానంగా ఉందని, ప్రభుత్వ సహకారంతో ఈ సమస్యను అధిగమిస్తామని స్పష్టంచేశారు.

మహనీయులకు నివాళులు

బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ముందుగా ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, వర్సిటీ వ్యవస్థాపక ఉప కులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రెక్టార్ కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్లు, ఇతర అధికారులతో ఆయన అకడమిక్ సెనేట్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ ప్రక్రియకు ముందు ఎవరూ పూల బొకేలు, శాలువాలు, బహుమతులు తీసుకురావద్దంటూ ముందుగానే సర్క్యులర్‌ను పంపించారు. అనంతరం సెనేట్ హాలులో వివిధ విభాగాల నుంచి వచ్చిన ఫ్యాకల్టీ, సిబ్బందితో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చాక్లెట్ ఇచ్చి వారి వివరాలను తెలుసుకున్నారు.

